ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 20 జనవరి 2026 www.prajaswaramdailly.com 2 PM



## గజ్వేల్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

గజ్వేల్ (ప్రజాస్వరం) : గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ తూంకుంట నర్సారెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి లు అన్నారు. గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 3, 5,6వ వార్డు లో సీసీ రోడ్ల పని కి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి , మరియు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి లు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కర్ణాటక రాష్ట్ర డీజీపీ స్థాయి అధికారి సస్పెండ్

**బెంగళూరు, ప్రజాస్వరం**



తన కార్యాలయంలోనే పలువురు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐపీఎస్ అధికారి, డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్ఫోర్స్‌మెంట్ డీజీపీ డాక్టర్ కె. రామచంద్రరావును కర్ణాటక ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు సిబ్బంది, పరిపాలన సంస్కరణల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రవర్తన ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందని, ప్రభుత్వ ఉద్యోగికి తగనిదని ఉత్తర్వుల్లో పేర్కొంది. రామచంద్రరావు తన కార్యాలయంలో పలువురు మహిళలతో సన్నిహితంగా మెలుగుతున్న వీడియోలు ఇటీవల సోషల్ మీడియాలో, పలు న్యూస్ ఛానళ్లలో విస్తృతంగా ప్రసారమయ్యాయి. ఈ వీడియోల ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. "ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన ప్రవర్తన అఖిల భారత సర్వీసుల (ప్రవర్తనా) నిబంధనలు–1968లోని రూల్ 3ను ఉల్లంఘించడమేనని ప్రాథమికంగా నిరారణకు వచ్చాం. అందుకే విచారణ పూర్తయ్యే వరకు ఆయన్ను తక్షణమే సస్పెన్షన్‌లో ఉంచుతున్నాం" అని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## జ్యూరిచ్ నగరానికి సీఎం రేవంత్ బృందం



జ్యూరిచ్ విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డికి భారత రాయబారి మృదుల్ కుమార్ స్వాగతం పలికారు. స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ నగరానికి సీఎం రేవంత్ బృందం చేరుకుంది. రేవంత్ బృందానికి జ్యూరిచ్ విమానాశ్రయంలో ప్రవాస తెలంగాణ వాసులు ఘనస్వాగతం పలికారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి, ఉన్నతాధికారులు ఉన్నారు. ఇప్పటికే దావోస కు మంత్రి శ్రీధర్ బాబు చేరారు. తెలంగాణ తరపున వరల్డ్ ఎకనామిక్స్ ఫోరం 2026లో ఈ బృందం పాల్గొననుంది. స్విట్జర్లాండ్

# సిట్ విచారణకు మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, ప్రజాస్వరం**



ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పీఎస్‌కు ఆయన చేరుకున్నారు. హరీశ్‌రావు వెంట న్యాయవాదులను పీఎస్ లోపలికి పోలీసులు అనుమతించలేదు. పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని హరీశ్‌రావుకు సోమవారం సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన జిల్లా పర్యటనలో ఉండటంతో సిట్ సిబ్బంది నోటీసులను కోకాపేటలోని ఆయన ఇంట్లో ఇచ్చి వెళ్లారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు, వ్యాపారులు మొదలు జడ్జీల ఫోన్లనూ ట్యాప్ చేశారని, వాటికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో 2024 మార్చిలో కేసు నమోదైంది. అనంతరం జరిగిన పరిణామాల్లో ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు విదేశాలకు పారిపోవడంతో దర్యాప్తునకు ఆటంకం ఏర్పడింది. మిగతా నిందితులను అరెస్టు చేసినప్పటికీ ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో చాలా కాలంపాటు దర్యాపు నిలిచిపోయింది. గత జూన్‌లో ప్రభాకర్‌రావు హైదరాబాద్ రావడంతో దర్యాప్తు ఊపందుకుంది.

## ఇదంతా డైవర్షన్ పాలిట్రిక్స్

**మాజీ మంత్రి హరీష్ రావు**

ప్రభుత్వం అవినీతి బయటపడిందని సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు ముందు మీడియాతో మాట్లాడారు. నిన్న ఉదయం రేవంత్ బావమరిది బాగోతాన్ని బయటపెడితే.. రాత్రి 9 గంటలకు సిట్ నోటీసులు వచ్చాయని, ఈరోజు ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారన్నారు. అవినీతిపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇలాగే చేస్తారని విమర్శించారు. రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రిజల్ట్స్ చూసి రేవంత్ కు దిమ్మ తిరిగిందని, మున్సిపల్ ఎన్నికల్లో ఇంకా బలపడతామన్న భయం సీఎం రేవంత్ రెడ్డిలో మొదలైందన్నారు.

గతంలో ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా కొట్టివేసిందని హరీష్ రావు తెలిపారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి న్యాయవాదుల్ని పెట్టినా.. న్యాయం తనవైపు ఉందని గెలిచామన్నారు. తాము తప్పు చేయలేదు కాబట్టి ఎవ్వరికీ భయపడమన్నారు. మీడియాను, ప్రజల అటెన్షన్ ను డైవర్ట్ చేసేందుకు శతవిధాలా ప్రయత్నించినా వదిలి పెట్టబోమన్నారు. బొగ్గు కుంభకోణం, ఆంధ్రాకు అమ్ముడుపోవడం, పవర్ స్కామ్, అవినీతి బాగోతాలపై నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రజల పక్షాల ఆరుగ్యారెంటీలపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. రేవంత్ రెడ్డి వందలకోట్ల సింగరేణి సొమ్మును తన సోకులకు ఖర్చు చేస్తుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కేవలం ఒక అక్రమ కేసు అని, రాజకీయాలను డైవర్ట్ చేసేందుకు రేవంత్ రెడ్డి ఆడుతున్న సిల్లీ డ్రామా అన్నారు. ఎన్నిసార్లు రమ్మన్నా, ఎక్కడికి రమ్మన్నా విచారణకు వెళ్తామన్నారు. ఎంత ఇబ్బంది పెట్టినా ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు.

## కిషన్ రెడ్డికి హరీష్ లేఖ

**హైదరాబాద్, ప్రజాస్వరం**

**సింగరేణి టెండర్లలో అక్రమాలు జరుగుతున్నాయని వెంటనే దీనిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ రాశారు..**

## బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా.. నితిన్ నబీన్ ప్రమాణం



**న్యూఢిల్లీ, ప్రజాస్వరం**

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, పార్టీ ఎంపీలు హాజరయ్యారు.

## అటవీ జంతువుల సర్వే ప్రారంభం

**తూప్రాన్ జనవరి 20 (ప్రజాస్వరం )పూర్ణ రాజ్ గౌడ్ ప్రతినిధి**

తూప్రాన్ మండలంలో అటవీ జంతువుల గణన సర్వే మొదలైందని అటవి శాఖ సెక్షన్ ఆఫీసర్ ఓం ప్రకాష్ తెలిపారు. ఈనెల 20 21 22 రోజులలో మాంసా ఆహార జంతువుల గణన ఉంటుందని 23 24 25 తేదీల రోజులలో శాఖాఆహార జంతువుల గణన సర్వే ఉంటుందని సెకషన్ అధికారి ఓం ప్రకాష్ వెల్లడించారు ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ చిరంజీవి శిక్షణ విద్యార్థులు పాల్గొంటున్నారు




## తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం: ప్రధాని మోదీ



గడిచిన 12 ఏళ్లలో ఎన్నో రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని ప్రధాని మోదీ తెలిపారు. గతంలో గెలవని రాష్ట్రాల్లోనూ గెలిచి చూపించామని అన్నారు. తొలిసారి బంగాల్, తెలంగాణలో కూడా అధికారంలోకి రానున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళలో కూడా బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని మోదీ అన్నారు. దేశంలో ఒక్కో పార్టీది ఒక్కో విధానమని, కాంగ్రెస్ పార్టీది కుటుంబ మోడల్ అంటూ విమర్శించారు. బీజేపీది మాత్రం ఎల్లప్పుడూ అభివృద్ధి మోడల్ అంటూ చెప్పుకొచ్చారు. భారతీయ జనతా పార్టీ చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. గత 12 ఏళ్లలో ఎన్నో రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని గుర్తు చేసుకున్నారు. తొలిసారి బంగాల్, తెలంగాణలో కూడా అధికారంలోకి రానున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీది మాత్రం ఎల్లప్పుడూ అభివృద్ధి మోడల్ అంటూ చెప్పుకొచ్చారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు వ్యాఖ్యలు చేశారు.

**బీజేపీ కార్యకర్త అనిపించుకోవడమే నాకు గర్వకారణం**

సాధారణ కార్యకర్త కూడా బీజేపీజాతీయ అధ్యక్షుడు కాగలరని ప్రధాని మోదీ తెలిపారు. భారతీయ జనతా పార్టీ నిర్ణయాలు, ఎంపిక అన్నీ ప్రజాసామ్యయుతంగా ఉంటాయని చెప్పారు. దేశ సేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయన్నారు. కార్యకర్త కేంద్రంగా పార్టీ సిద్ధాంతాలు ఉంటాయని తెలిపారు. బీజేపీ కార్యకర్త అని అనిపించుకోవడమే తన గర్వకారణంగా ఉంటుందని ప్రధాని పేర్కొన్నారు.

## నిర్మల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### నలుగురు దుర్మరణం.. మరో ముగ్గురికి గాయాలు

**నిర్మల్, ప్రజాస్వరం**

నిర్మల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. భైంసా పట్టణంలోని సత్‌పూల్ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా వస్తున్న కంటైనర్, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువులను పరామర్శించేందుకు కారులో హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో కబీరు మండలం కుప్టీ గ్రామానికి చెందిన బోజరాం పటేల్ (42), రాజన్న (60), బాబన్న (70), కారు డ్రైవర్ వికాస్ (35) మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఇటీవలే సర్పంచ్‌గా ఎన్నికైన గంగాధర్ కూడా ఉన్నారు. ఆయనకు తలకు తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.